బీజేపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు



మాట్లాడుతున్న బీజేపీ శాసనసభ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మియాపూర్ ఆల్విన్ కాలనీలో విజయ సంకల్ప యాత్రకు హాజరైన జనసంద్రోహం

బీజేపీ ఫ్లోర్‌లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని శాసనసభ బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. విజయ సంకల్పయాత్ర నాల్గవ రోజు శేరిలింగంపల్లిలో నానక్‌రాంగూడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌తో కలిసి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. నానక్‌రాంగూడ నుంచి మియాపూర్ వరకు ర్యాలీ కొనసాగింది. నానక్‌రాంగూడలో మాట్లాడుతూ బీజేపీ నాయకత్వంలో ప్రధాని నరేంద్రమోదీ మూడవ సారి భారీ మెజార్టీతో మళ్ళీ ప్రధాని కావడం ఖాయమన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం మొత్తం నమ్మకంగా ఉందని, మూడవ సారి ముచ్చటగా భారీ మెజార్టీతో మోడీ మళ్ళీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరని ఆయన గుర్తు చేశారు. బీజేపీకి పార్లమెంటు ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సీట్లు రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అధికారప్రతినిధి రాణి రుద్రమదేవి,బీజేపీ నాయకులు రవికుమార్‌యాదవ్, తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే సమగ్ర అభివృద్ధి...

హఫీజ్‌పేట్: భారతీయ జనాతా పార్టీతోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని బీజేపీ శాసన సభ పక్షనేత ఏ.మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విజయ సంకల్ప యాత్రలో భాగంగా మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలో రోడ్ షో నిర్వహించి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ రోడ్ షోకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడిడ, చేవెళ్ళ మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్‌లు హాజరయ్యారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న పట్నం సునీతా మహేందర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ళ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీతా మహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగండ్లలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సునీతా మహేందర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్‌కు వెళ్ళే అవకాశం ఇస్తే ప్రజా సేవకు అంకితం అవుతానని, అదే విధంగా మహిళా గొంతుకనవుతానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో శేరిలింగంపల్లి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు.

కనుల పండువగా మేడారం మినీ జాతర

సమ్మక్క, సారలమ్మకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి పాపిరెడ్డినగర్‌లోని సమ్మక్క, సారలమ్మ అమ్మవార్ల మినీ జాతర మహోత్సవాలు శుక్రవారం కనులపండువగా జరిగాయి. ఈ జాతరకు ఏసీపీ హనుమంతరావు, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్‌లో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, జంపన్నలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంతో కూడిన బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి సన్మానించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవార్ల గద్దెలకు ప్రత్యేక పూజలు జరిపి నైవేద్యాలు సమర్పించి పట్టు వస్త్రాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో జాతర మహోత్సవ కమిటీ సభ్యులు శ్రీధర్‌పటేల్, భూపాల్ రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, రాజిరెడ్డి, ప్రకాష్‌రావు, పటేల్, బాలు యాదవ్, నరేందర్ రెడ్డి, హరియాదవ్, గోపాలరావు, శ్రీలత, రాజేంద్ర ప్రసాద్, ప్రభాకర్ పటేల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



అమ్మవార్లను దర్శించుకుంటున్న ఏసీపీ హనుమంతరావు, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్

పార్కుకు రక్షణ కరువు

- పచ్చదనం దరిదాపుల్లో కనపించని వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇదీ 'నల్లగండ్లలోని ట్రీ పార్కు, రాక్‌గార్డెన్' పరిస్థితి

ప్రహరీగోడ దిమ్మెలు కూల్చి మధ్య ఉండే పైపుల అపహరణ



ప్రహరీ దిమ్మెలు కూల్చి పైప్‌లను మాయం చేసిన దొంగలు

శేరిలింగంపల్లి: పచ్చదనం దరిదాపుల్లో కనిపించదు.....పార్కులాగే అనిపించని వాతావరణం.....మొక్కుబడిగా సౌకర్యాల కల్పన..... అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు పార్కుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో 'ట్రీపార్కు, రాక్‌గార్డెన్' పేరుతో జీహెచ్‌ఎంసీ హుడా వుడిగా కొద్ది భాగంలో పార్కును అభివృద్ధి చేసింది. గతంలో ఈ స్థలంలో డంపింగ్ కేంద్రం ఉండటంతో పలువురు కోర్టు ఆశ్రయిండంతో పార్కుగా కొంతభాగాన్ని తీర్చిదిద్దారు. ఇంత వరకు భాగానే ఉన్నా పార్కులో కనీసం వాకింగ్ ట్రాక్ లెవల్‌గా లేకపోవడంతో కూడ ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడ చూసిన ఎండిన మొక్కలు, చెట్లు, చెట్ల వ్యర్థాలతో నిండిన వాతావరణమే అగుపిస్తుంది. ఈ పార్కును ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తే కాలనీవాసులకు ఎంతో సౌలభ్యంగా ఉండే అవకాశం ఉంది.

- నల్లగండ్లలో ట్రీపార్కు, రాక్‌గార్డెన్ పేరు పెట్టడంతో ఇది చెట్లతో నిండిపోయే పార్కుగా, దశాబ్దాల నుంచి ఉన్న భారీ బండరాళ్లను పరిరక్షించడానికి రాక్‌గార్డెన్ కూడా ఇందులో ఏర్పాటు చేశారు.
- ఏపుగా పెరిగిన చెట్లు నిర్లక్ష్యం కారణంగా ఎండిపోయి కళావిహీనమై ఎవరూ వెళ్ళలేని విధంగా మారిపోయింది.



నల్లగండ్ల హుడాకాలనీలోని ట్రీపార్కు.

- వాకింగ్ ట్రాక్ నిర్మాణం కూడా చేసినా, లెవల్‌గా లేకపోవడంతో ఫలితం లేకుండా పోయింది.
- పది ఎకరాల్లో పార్కు విస్తీర్ణ ఉన్నా కొంత ప్రాంతంలోనే మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టారు
- పార్కుకు నాలుగు రోడ్లు ఉండగా పార్కు ముందు భాగం, కుడి వైపున ఉన్న వాల్స్‌పై మాత్రమే దిమ్మెల మధ్య ఐరన్ పైపులు ఉన్నాయి. వెనుక భాగం, ఎడమ వైపు రోడ్లకు ఉన్న పైపులు గుర్తు తెలియని వ్యక్తులు వాటిని తస్కరించినా పట్టించుకునే వారు లేరా అనే ప్రశ్నలు వస్తున్నాయి.

సౌకర్యాలు కల్పించాలి

- పార్కు చుట్టూ ప్రహరీగోడను మళ్ళీ నిర్మాణం చేయించాలి
- ఎండిన చెట్లన్నీ తొలగించి కొత్తగా ట్రీ పార్కు కావడంతో ఆకట్టుకునే చెట్లు, పూల మొక్కలను పెంచేలా చర్యలు తీసుకోవాలి
- స్థానికులు సేద తీరే పరిస్థితులు కల్పించాలి
- పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి
- రాక్‌గార్డెన్ కూడా పేరులో ఉండడంతో భారీ బండరాళ్ళను మరింత ఆకర్షణీయంగా మారేలా చేయాలి, రాత్రి వేళల్లో రంగు రంగుల లైట్లను అమర్చి అందరికీ సాయంత్రం నుంచి ఆకట్టుకునేలా చేయాలి
- పార్కులో బెంచీలు, కింద కూర్చోవడానికి అవసరమైన గ్రాస్ ఏర్పాటు చేయాలి
- నిత్యం విధుల్లో నిమగ్నమయ్యేవారు సాయంత్రం వేళల్లో పార్కులోకి కుటుంబసభ్యులతో వచ్చి సేద తీరేలా వాతావరణం కల్పించడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

నగరానికి స్వాద్ ఆఫ్ సౌత్

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణాది వంటకాలకు పేరొందిన రెస్టారెంట్ బ్రాండ్ 'స్వాద్ ఆఫ్ సౌత్' నగరంలోని మాదాపూర్‌లో కొత్త అవుట్‌లెట్ ఏర్పాటు చేసింది. దీనిని ప్రారంభించిన సందర్భంగా...బ్రాండ్ కో ఫౌండర్ రోనక్ సింఘీ మాట్లాడుతూ కోకోనట్ షెల్ ఇడ్లీ, చెట్టినాడ్ పనీర్ మసాలా దోశ, మలబార్ పరోటా–కుర్మా., ఎస్ఐఎస్ స్పెషల్ హల్వా...మధురై జిగర్ తండా... వంటి వెరైటీ రుచులతో మెనూ రూపొందించన్నారు.

సమస్య పరిష్కారం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ఆరో వార్డులో రోడ్డు సరిగా లేకపోవటంతో మాజీ వార్డు సభ్యురాలు నవ్య ఆధ్వర్యంలో గురువారం సొంత నిధులతో మట్టి పోయించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. రాకపోకలు ఎక్కువగా ఉండటంతో గుంతలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే సొంత నిధులతో మట్టి పోయించి సమస్యను పరిష్కరించినట్లు నవ్య తెలిపారు.

ఆలోచింపజేసిన సైన్స్‌ఫేర్



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని త్రివేణి స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. నేషనల్ సైన్స్ డే ను పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని త్రివేణి స్కూల్స్ ప్రైమరి అకడమిక్ కో ఆర్డినేటర్ అర్చనా ఠాకూర్ ప్రారంభించారు. అర్చనా ఠాకూర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో వచ్చే ఆలోచనలతో దేశాభివృద్ధికి ఉపయోగపడే ఎన్నో కొత్త విషయాలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు.

స్కాంలు ఎవరు చేసినా వదలం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అశ్విని కుమార్ చౌబే

లిక్కర్ కేసులో కవిత జైలుకు ఖాయం

- హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ మీనమేషాలు
- కేంద్ర సహాయ మంత్రి అశ్విని చౌబే

పటాన్‌చెరు టౌన్: ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట కవిత త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని కేంద్ర పౌర సరఫరాలు, అటవీ, పర్యావరణ శాఖల సహాయ మంత్రి అశ్విని కుమార్ చౌబే అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరి విజయ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో స్కాంలు ఎవరు చేసినా వదలబోమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా పరిపాలన అందిస్తూ, దేశ సంస్కృతి, అభివృద్ధిని ప్రపంచానికి ఆదర్శంగా నిలుపుతున్నారని చెప్పారు. యావత్ ప్రపంచం మన దేశం వైపు చూస్తోందన్నారు. ఢిల్లీలో పప్పు, బిహార్‌లో లప్పు, ఉత్తరప్రదేశ్‌లో గప్పు, సప్పు వీళ్లందరూ దేశం ప్రగతి విరోధకులుగా నిలుస్తున్నారని విపక్షాల ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి పేరుతో మోసం చేసేందుకు ప్రజల ముందుకు వస్తున్నారని విమర్శించారు. దేశాన్ని ముక్కలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీకి ప్రధాన మంత్రి కుర్చీ కావాలట.. కుర్చీ ఇస్తే దేశాన్ని అమ్మేస్తారని చెప్పారు. కేరళ నుంచి పార్లమెంటుకు పంపితే ఒక్క రోజు కూడా ప్రజల కోసం పనిచేసింది లేదన్నారు. భారత్ జోడో యాత్ర కాదు.. భారత్ తోడోయాత్ర అని ఎద్దేవా చేశారు. భారత్ న్యాయ యాత్ర పేరుతో కోట్లు వెనకాల వేసుకుంటున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభావం తప్పదన్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. 400 ఎంపీ స్థానాలు గెలిచి మూడోసారి ప్రధాని మోదీ కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ శాసనసభ పక్ష నేత మహేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షురాలు గోదావరి తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులకు గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సుల దరఖాస్తుకు గడువు తేదీని పొడిగించినట్లు యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ శుక్రవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ పీహెచ్‌డీలో కూడా ప్రవేశాలు అందుబాటులో ఉంటాయని,దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానే సమర్పించుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 25వ తేదీ వరకు స్పాన్సర్డ్/సెల్ఫ్–ఫైనాన్సింగ్ మోడల్‌లో పార్ట్‌టైమ్ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్ష షెడ్యూల్ ప్రకారం మార్చి 8వ తేదీన జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కమ్ అప్లికేషన్ రుసుము రూ.1500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

లాస్య నందిత మృతి బాధాకరం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

గచ్చిబౌలి: ఎంతో భవిష్యత్తు కలిగి ఉండి చిన్నవయస్సులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మికంగా మృతి చెందడం చాలా బాధాకరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ శుక్రవారం పేర్కొన్నారు. ఆమె మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గత ఏడాది ఆమె తండ్రి మాజీ ఎమ్మెల్యే సాయన్న మృతి చెందడం, మళ్ళీ ఈ ఏడాది కూతురు మృతి చెందడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఎంతో గొప్ప రాజకీయ భవిష్యత్తు ఉన్న లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కలిచివేసిందన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలపుతున్నానన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

మియాపూర్: వర్షకాలంలో వరదనీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎ.ఎస్.రాజునగర్, మహాధాయ ఎన్‌క్లేవ్ కాలనీలలో గత వర్షాకాలంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా నూతనంగా వరదనీటి కాలువ నీటి నిర్మాణం చేపట్టబోయే పరిసర ప్రాంతాలను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎఎస్‌రాజునగర్, మహోదా ఎన్‌క్లేవ్ కాలనీలో గత వర్షకాలంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా నూతనంగా వరదనీటి పనులు చేపట్టి పరిసర ప్రాంతాలను కాలనీ వాసులతో కలిసి పరిశీలించామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రావు, రాజు, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు, విద్యార్థులకు అవగాహన



రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పించిన దృశ్యాలు

రాయదుర్గం: వాతావరణ మార్పు, స్థిరత్వం అంశాలపై రైతులకు, విద్య ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్(సీఈఓఏఎస్) విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పర్యటన జరిపారు. హెచ్‌సీయూ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం సమీపంలోని మంచాల్ మండలం రంగాపూర్‌లో పర్యటించారు.రైతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాసంఘాలతో వారు మాట్లాడారు. చార్టులు, పోస్టర్ల సహకారంతో వారిలో అవగాహన కల్పించారు.

ఘనంగా శ్రీవారి వార్షికోత్సవం



లక్డీకాపూల్: కొండాపూర్ శ్రీనివాస్ కాలనీలోని శ్రీవారి 19వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఈ సందర్భంగా నిర్వహించిన స్వామి వారి తిరువీధి ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సోరియాసిస్‌కు ఒత్తిడే ప్రధాన కారణం

మాదాపూర్: సోరియాసిస్ రావడానికి ఒత్తిడే ప్రధాన కారణమని డెర్మాటాలజిస్ట్ డాక్టర్ ఎస్ కిరణ్ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడుతూ.. నేషనల్ సోరియాసిస్ ఫౌండేషన్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2 నుంచి 3 శాతం మిలియన్ల మందికి సోరియాసిస్ ఉందని తెలిపారు. భారతదేశంలో సుమారు 10మిలియన్ల సోరియాసిస్ కేసులు ఉన్నాయని తెలిపారు. ఒమ్ని హాస్పిటల్స్ ఎండి విజయ్ భాస్కర్ మల్లెల తదితరులు పాల్గొన్నారు.

క్రషర్లకు నోటీసులు జారీ

జిన్నారం(పటాన్‌చెరు): అనుమతులకు మించి బ్లాస్టింగ్‌లు చేపడుతున్న ఎనిమిది కంకర క్రషర్లకు నోటీసులకు అందించినట్లు తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, సోలక్‌పల్లి, మాదారం గ్రామాల పరిధిలోని ఎనిమిది కంకర క్రషర్లు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి బ్లాస్టింగ్‌లు జరుపుతున్నట్లు గుర్తించామన్నారు. వాటి యజమానులైన వెంకటప్రసాద్, లలిత, ఆనంద్‌రెడ్డి, అరుణ, పూర్ణచంద్, ఎండీ గౌస్, పరమేశ్వర్‌సింగ్, రాక్‌సాండ్ పరి శ్రమ ప్రతినిధులకు నోటీసులు అందించామని తెలిపారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

అవిశ్వాస ఎన్నికపై కోర్టు స్టే?

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై బీఆర్ఎస్ నేతలు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 26 అవిశ్వాసంపై ఎంపీటీసీలతో సమావేశం జరగాల్సి ఉంది. అవిశ్వాస ఎన్నికపై హైకోర్టు స్టే ఇచ్చిందనే ప్రచారం మండలంలో జరుగుతోంది. మరో రెండు రోజుల్లో అవిశ్వాస సమావేశం జరగాల్సి ఉండగా హైకోర్టు స్టే ఇవ్వటంపై ఏం జరుగుతుందోనని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చర్చలు జరుపుతున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు క్యాంపులో ఉన్నారు. ఈ విషయమై ఆర్డీఓ రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా కోర్టు స్టే ఇచ్చిందనే సమాచారం ఉంది కాని ఇంకా తమకు కోర్టు పత్రాలు అందలేదన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని నల్తూర్ గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు చంద్రారెడ్డి తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అసలేమైంది?

వాహనాన్ని ఢీ కొట్టిందా.. రెయిలింగ్‌కు గుద్దుకుందా?

- ఇంకా నిర్ధారణకు రాని పోలీసులు
- ప్రమాదం జరిగిన తీరుపై సమగ్ర దర్యాప్తు
- ఐదు శాఖల నిపుణులతో ప్రత్యేక బృందం
- ఆకాష్ వాంగ్మూలాన్ని రికార్డు చేసిన పోలీసులు
- కండ్లకు చీకట్లు కమ్ముకోవడంతో ప్రమాదం జరిగిందని చెప్పినట్లు సమాచారం.?
- ఓఆర్ఆర్‌పై సీసీటీవీ పుటేజీల సేకరణ



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే జ్ఞానలాస్య నందిత కారు ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై పోలీసులు ఇంకా ఓ నిర్ధారణకు రాలేక పోతున్నారు. నందిత ప్రయాణిస్తున్న కారు గుర్తు తెలియని వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొట్టిందా..? లేదా అతి వేగం కారణంగా రోడ్డు పక్కను ఉన్న రెయిలింగ్‌కు గుద్దుకుందా? అనేదానిపై ఇంకా పూర్తి స్థాయిలో నిర్ధారణకు రాలేకపోతున్నారని సమాచారం. ఈ రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు ఇప్పటికే కారు నడుపుతున్న ఎమ్మెల్యే పీఏ ఆకాష్ వద్ద వాంగ్మూలాన్ని రికార్డు చేస్తూ వీడియో కూడా తీశారు. ప్రమాదం జరిగినప్పుడు కండ్లు చీకట్లు అలుముకున్నాయని ఆకాష్ తన పేర్కొన్నట్లు సమాచారం.

వాహనంపై రోబోసాండ్ రేణువులు..

ప్రమాదానికి గురైన వీరి వాహనం ఎస్ఎల్–6 కారుపై రోబోసాండ్ రేణువులు పడి ఉండటాన్ని బట్టి ఈ వాహనం టిప్పర్‌ను ఢీకొట్టిందనే ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఓఆర్ఆర్‌పై ఉన్న టోల్‌గేట్ల వద్ద ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే.. ఆ సమయంలో సుమారు 15 నుంచి 20 వరకు టిప్పర్లు లాంటి భారీ వాహనాలు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అలా కాకుండా వీరి వాహనం సుమారు గంటకు వంద కిలోమీటర్ల వేగంతో వెళుతూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌కు గుద్దుకుందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన చోట టిప్పర్ లాక్కెల్లినట్లు గుర్తులు ఏమైనా ఉన్నాయా? అని పరిశీలించారు.

మరణించిన వారు ఎమ్మెల్యే కావడంతో..

ఈ రోడ్డు ప్రమాదంలో మరణించిన వారు ఎమ్మెల్యే కావడంతో ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసు దర్యాప్తును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు. ఈ రోడ్డు ప్రమాదానికి గల కారణా లను తేల్చేందుకు పోలీసులు ఐదు శాఖలతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు, మోటార్‌వెహికిల్ (టాన్స్‌పోర్టు డిపార్టుమెంట్), సివిల్ ఇంజనీర్ (ఓఆర్ఆర్ ఇంజనీరింగ్ విభాగం), క్లూస్‌టీం, ఫోరెన్సిక్ డాక్టర్లు.. ఇలా ఐదు కీలక శాఖల నిపుణులతో ప్రత్యేక బృందం ఈ కేసును ధర్యాప్తు చేస్తోంది. ఆయా శాఖల నిపుణులు ఒకటి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వ నున్నట్లు సమాచారం.

వాహనాన్ని పరిశీలించిన బృందం

ప్రమాదానికి గురైన వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన నిపుణుల బృందం ఎమ్మెల్యే లాస్యనందిత సీటు బెల్టు పెట్టుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. బెల్టు పెట్టుకుంటేనే బెలూన్‌లు ఓపెన్ అయ్యాయని చెబుతున్నారు. బెలూన్‌లు ఓపెన్ అయ్యాక కూడా లాస్య తీవ్ర స్థాయిలో గాయాల పాలవడం.. ఏకంగా మృత్యువాత పడటం ఎలా జరిగిందనే కోణంలో కూడా ఈ నిపుణుల బృందం దర్యాప్తు చేస్తోంది. వీరి వాహనం కొత్తది కావడంతో ఫిట్‌నెస్ లోపాలు కూడా ఉండవనే నిర్ధారణకు వచ్చారు.

మలుపులు లేని రోడ్డు..

ఇంజనీరింగ్ విభాగం నిపుణులు ఔటర్‌రింగ్ రోడ్డుపై ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అయితే ఈ ప్రమాదం జరిగిన చోట ఎలాంటి మలుపులు కూడా లేవని నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఎక్కడైనా సీసీటీవీ పుటేజీ దొరుకుతుందేమోనని పరిశీలించారు.

ప్రముఖుల సంతాపం

పటాన్‌చెరు: లాస్య నందిత మృతి చెందడం పట్ల మంత్రి దామోదర రాజనర్సింహ, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతోమంచి భవిష్యత్తు ఉన్న యువ ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఆమె మృతికి సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

స్పందించి ఉంటే.. బతికేదేమో?

పటాన్‌చెరు: ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు అందిఉంటే ఎమ్మెల్యే లాస్య నందిత బ్రతికేదేమోనని విశ్లేషిస్తున్నారు. ఔటర్ పై ప్రమాదం జరిగినప్పుడు ఆ సమాచారం సిబ్బందికి చేరేటప్పటికీ చాలా సమయం పడుతుంది. వాయువేగంతో వెళ్లే ప్రయాణికులెవరూ ప్రమాదంలో గాయపడ్డవారికి సాయం చేసే పరిస్థితి ఆ రోడ్డుపై ఉండటం లేదు. వేగంగా వెళ్లే వారు ఏదో జరిగిందని చూసీచూడనట్లు వెళ్లిపోవడం సహజం. లాస్య నందిత ప్రమాదం జరిగిన వెంటనే చనిపోయి ఉండదనే వాదన ఉంది. త్వరగా ఆసుపత్రిలో చేర్చి ఉంటే బతికి ఉండేదని చర్చించుకుంటున్నారు.

ఆమె వాహనం ఉదయం శామీర్‌పేట వద్ద ఉదయం 5.11 గంటలకు ఓఆర్ఆర్‌పై కి చేరిందని తెలుస్తుంది. అయితే ప్రమాద స్థలికి చేరుకునే సరికి దాదాపు 20 నిమిషాల్లోపే పడుతుంది. ఆమె ప్రయాణించిన వాహనం గంటకు వంద కిలోమీటర్ల కంటే వేగంగా వెళ్తుందని అంచనా వేస్తే 5.30 గంటలకల్లా ప్రమాదం జరిగి ఆమె కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంటుంది. అయితే సమాచారం పోలీసులకు అంది ఆమెను ఆసుపత్రికి తెచ్చే లోపు గంటకు పైగా సమయం పట్టింది. ఔటర్‌పై ప్రమాదాలు జరిగితే మరింత వేగవంతంగా సమాచారం అందేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఔటర్ పెట్రోలింగ్ వాహనాలున్నప్పటికీ ప్రమాదంపై సమాచార త్వరగా చేరే వ్యవస్థ లేదు. దీంతో ప్రమాద బాధితులకు వెంటనే సహాయక చర్యలు అందడం లేదు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



డివిజన్లలోని ట్రాఫిక్ సమస్యలపై సీఐ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కూకట్‌పల్లి సీఐ శ్రీనివాసులుతో సమీక్ష నిర్వహించారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ, సప్తగిరి కాలనీ, భాష్యం స్కూల్ ప్రాంతం, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ, నవోదయ కాలనీల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉంటోందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. దీంతో పాఠశాలలకు, ఉద్యోగాల నిమిత్తం వెళ్లే వారు నరక యాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. గంటల కొద్దీ రోడ్లపైనే ఉండాల్సి వస్తోందని... ట్రాఫిక్ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని.. ప్రత్యమ్నాయ మార్గాలపై దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలేకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కాలనీవాసులు శర్మ, మల్లయ్య, హర్ష, రాజిరెడ్డి, ప్రవీణ్, శివశంకర్, మదన్, సత్యనారాయణ, అల్లురయ్య, స్వరూపానంద్, శ్యామ్‌కుమార్, హేమచందర్, వినోభా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.